విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఓటు వినియోగించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర - గుడివాడ : సార్వత్రిక ఎన్నికలలో గుడివాడ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు (వైకాపా) కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము స్థానిక రాజేంద్రనగర్‌లో టౌన్ హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఎన్నికల సరళిని పరిశీలించారు.

అగ్ని ప్రమాదానికి ఆహుతైన ఆరు పుట్ల కంద దుంపలు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలం భట్ల పెనుమర్రు ఆయకట్టు పొలాలలోని రెండు నిట్టాళ్ళ పాకలో పోసిన ఆరు పుట్ల కంద దుంపలు అనుమాన పరిస్థితులలోఅగ్ని ప్రమాదానికి అహుతైనాయి. ఈ మేరకు కౌలు రైతు యార్లగడ్డ వెంకట్రామయ్య కుమారులు కూచిపూడి పోలీస్‌స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. వారు అందించిన వివరాలు ప్రకారం..భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు చలసాని కృష్ణ ప్రసాద్‌కు చెందిన భీమ నది డ్రైన్ దాటిన తర్వాత గల పొలాన్ని కూచిపూడికి చెందిన యార్లగడ్డ వెంకట్రామయ్య కుటుంబ సభ్యులు కౌలుకు చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు నిట్టాళ్ళ పాటు కందపంట పూర్తిగా అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఆస్తి నష్టం సుమారు లక్ష రూపాయలకు పైగా ఉంటుందని అంచనా!. ఈ ప్రమాదానికి కారణాలు తెలియలేదు.

బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అవనిగడ్డ: బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణచిరువోలంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణానదీ ఆయల నడుమ స్వయంగా వెలసిన బాలశిశంకర భగవాన్‌కి శనివారం క్రోధినామ సంవత్సర ఉత్తరాయణం వసంత ఋతువు వైశాఖమాసం శుక్లపక్షం షష్టి తిథిని పురస్కరించుకొని స్వామివారికి విశేషపూజలు నవవిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించారు ఆలయ ఆవరణలో గల నాగేంద్రస్వామివారి పుట్టలో భక్తులు పాలు పోసి పసుపూ కుంకుమ పూలు పండ్లతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి నవవిధ అభిషేకాలు గోత్రనామ పూజలు నిర్వహించగా ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ భక్తులకు కావల్సిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

ప్రధాన పార్టీల గెలుపోటములపై సీపీఐ అభ్యర్థి ప్రభావం: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు పార్లమెంట్‌కు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ గణనీయమైన ఓట్లు సాధించి పార్లమెంట్ పరిధిలోని ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై ప్రభావం చూపుతారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరులో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఎనిమిది రాష్ట్రాలలో జరుగుతున్న 4వ విడతల ఎన్నికల సరళిని పరిశీలిస్తే బీజేపీ వెనకబడిపోయిందని తెలుస్తుందని అన్నారు. దీంతో బీజేపీ ఓటమి ఖాయమని అన్నారు. రాష్ట్రంలో కూడాగుణాత్మకమైన మార్పు జరుగుతుందని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని రక్షించుకోవాలనుకునే ప్రతిఒక్కరూ ఇండియా కూటమిని బలపరుస్తున్నారని, ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కమాండ్, కంట్రోల్ సెంటర్ పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేందుకు కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, అసిస్టెంట్ కలెక్టర్(ట్రైనీ) పవార్ స్వప్నీల్ జగన్నాథ్‌లతో కలసి పరిశీలించారు.

ఓటేసిన నంబూరు శంకరరావు, భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : సార్వత్రిక ఎన్నికలలో మం డల పరిధి లోని 75 తాళ్లూరు జెబీ పాఠశాలలో వైసీపీ అభ్య ర్థి నంబూరు శంకర్రావు ఓటు వినియోగించుకున్నారు. ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తాటి కొండ మండలం పరిమి గ్రామంలో ఓటుని వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, అమరావతి మండలాల్లో 85 శాతం పోలింగ్ నిర్వహించినట్లు ఆర్వో శ్రీరాములు తెలిపారు. ఉదయం 7 గంటలకి బారులుతీరి సాయంత్రం 8 గం. వరకు ఓటుని వినియోగించుకున్నారు.

పోలింగ్ ప్రశాంతం

78శాతం ఓటింగ్ నమోదు



విశాలాంధ్ర-అవనిగడ్డ: నియోజకవర్గంలో ఓటింగ్ శాతం 78 శాతం నమోదయినట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన ఓటింగ్‌లో అవనిగడ్డ మండలంలోని పాత ఎడ్లంక గ్రామంలో 157వ పోలింగ్ బూత్‌లో అత్యధికంగా 96 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. నియోజకవర్గవ్యాప్తంగా ఉదయం 7గంటలకు ప్రారంభమైనన ఓటింగ్ సర్వే క్రమేనా స్పీడ్ అందుకుంది. అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు దంపతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ ఓటు హాక్కు వినియోగించుకోగా మచిలీపట్నం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డా॥ సింహాద్రి చంద్రశేఖర్‌రావు అవనిగడ్డ బూత్ నెంబర్ 153లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూటమి అవనిగడ్డ నియోజకవర్గ జనసేనా అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ దంపతులతో పాటు వారి కుటుంబసభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జాతీయ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ అభ్యర్థి అందె శ్రీరామమూర్తి దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకోగా మహిళా ఓటర్లు పెద్దఎత్తున బారులు తీరారు. సీనియర్ జర్నలిస్ట్ దివి సమాచార ఎడిటర్ తుర్లపాటి రామోహ్మన్‌రావు వినుత్నంగా మెడలో ముందూ వెనుక డబ్బు కాదు ఓటు ప్రజాస్వామ్య రక్షణకు వెయ్యండి అంటూ ప్లకార్డులను వేసుకొని ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నియోజకవర్గంలో 2,3 సంఘటనలు మినహా ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిలిచింది. చల్లపల్లి ఎంపిపి స్కూల్‌లో తూర్పు వైపు ఉన్న భవనం, నారాయణరావునగర్ కాలనీ పోలింగ్ బూత్ 67,68లో ఓటర్ల మధ్య చిన్న ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మోపిదేవి లంక గ్రామంలో వైసిపి శ్రేణులపై టిడిపి శ్రేణులు దాడి చేశారు. మోపిదేవి లంక గ్రామానికి చెందిన రాజులపాటి నాగేశ్వరావు, కేసాని తేజశ్రీ, మోర్ల శ్రీనుపై టిడిపి శ్రేణులు దాడి చేయడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో స్పందించిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. టిడిపి శ్రేణుల దాడిలో గాయపడిన వైసిపి నాయకులను అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించి సంఘటనలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ 2 సంఘటనలు మినహా నియోజకవర్గంలో ప్రశాంతంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాగాయలంక మండలం భావదేవరపల్లి గ్రామానికి చెందిన ఆవుల సాయిజ్ఞానేష్ తన ప్రథమ ఓటును భావదేవరపల్లిలో వినయోగించుకున్నారు. పవన్‌కళ్యాణ్ భావజాలం నచ్చి కెనడాలో విద్యను అభ్యసిస్తున్న 2.50లక్షలు ఖర్చు చేసి మొదటి ఓటును వినియోగించుకొని అభిమానం చాటుకున్నాడు. మండలంలో 96 శాతం పాత ఎడ్లంక గ్రామం పోలింగ్ నమోదు చెసుకుంది. ఈ గ్రామంలో మొత్తం 743 ఓట్లు ఉన్నాయి. మహిళలు 390కి గాను 360, పురుషులు 353కి గాను 343 మంది ఓట్లను ఓటింగ్ చేశారు. 96 శాతంతో మండలంలో గ్రామం మొదటి స్థానంలో నిలిచింది. ఓటింగ్ ప్రక్రియ ప్రశాతంగా జరగడంతో ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు ఓటర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం తీవ్రంగా సూర్య భగవానుడు తన ప్రభావం చూపినప్పటికీ మధ్యాహ్నం నుండి ఆకాశం మెగావృతమై చల్లదనాన్ని ఇవ్వడంతో ఓటర్లు బారులు తీరారు. అశ్వరావుపాలెంలో వృద్ధురాలు వీలు చైర్‌పై ఓటు కోసం రాగా మోదుమూడిలో మరో వృద్ధురాలు బంధువుల సహాకారంతో పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మొవ్వ మండలంలో..

విశాలాంధ్ర-కూచిపూడి: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మొవ్వ మండలంలో ఓటర్లు అధిక సంఖ్యలో తరలిరావడంతో పోలింగ్ కేంద్రాలు ఉదయం ఏడు గంటలకే కిటకిటలాడాయి. ఒక్కొక్క ఓటరు రెండు ఈవీఎంలో ఓట్లు వేయాల్సి రావటంతో పోలింగ్ ఒకింత ఆలస్యంగా జరగటంతో ఓటర్లు గంటలు తరబడి పడి కాపులు పడాల్సి వచ్చిన పరిస్థితి దాపురించింది. ఈ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి తెల్లారేసరికి పోలింగ్ కేంద్రాల వద్దకు రావడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. కేంద్రాలలో ఏ విధమైన అల్లర్లు సాగకుండా డి.ఎస్.పి యు.నాగరాజు ఆధ్వర్యంలో సీఐ రవికుమార్ పర్యవేక్షణలో, కేంద్ర బలగాలు, పోలీస్ స్టేషన్ బలగాలు కూచిపూడి ఎస్సై టి.శ్రీనివాస్ సారథ్యంలో బందోబస్తు నిర్వహించారు. అయితే మండలంలోని రెండు మూడు కేంద్రాల్లో చిన్న చిన్న తోపులాటలు ఘర్షణలు జరిగినట్లు సమాచారం. కాగా సమస్యాత్మక ప్రదేశాలుగా గుర్తించిన అయ్యంకి, పెదపూడి, మొవ్వపాలెం, కాజ, మొవ్వ హై స్కూల్ ప్రాంతాలలో కేంద్ర బలగాలతో పాటు పోలీసులు అధిక సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు. మొవ్వ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పరిశీలించగా, కూచిపూడి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పామర్రు నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి వర్ల కుమార్ రాజా పరిశీలించారు. ఉదయం నుంచి విపరీతమైన ఎండవేయగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి మొవ్వ మండలంలో కురిసిన వర్షం ఓటర్లను ఇబ్బంది పాలు చేసినా వాతావరణం చల్లబడి ఊరట నిచ్చింది. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా ఓట్లు పోలైనట్లు సమాచారం. సగటున మండలం లో 85 శాతానికి పైగా పోలింగ్ జరిగినట్లు సమాచారం.

గుడివాడలో..

విశాలాంధ్ర - గుడివాడ : సార్వత్రిక ఎన్నికలు గుడివాడ నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం నుండి సాయత్రం వరకు ఓటర్లు పోలింగ్ బూతల వద్ద పోటేత్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా 75.40 శాతం పోలింగ్ నమోదు అయ్యాయి. ఎర్రటి ఎండను లెక్కచేయకుండా ఓటర్లు బారులు తీరారు. 2019 ఎన్నికల్లో 66 శాతం నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం భారీగా పెరగడం విశేషం. ఎన్నికలు సజావుగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రతి బూత్ వద్ద పోలీస్ పికెటింగ్‌ను ఏర్పాటు చేసారు. అంతేకాకుండా నూతనంగా ఓటు హక్కు పొందిన యువత భారీసంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకుని ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఓటింగ్ ముగిసే సమయానికి గుడివాడ నియోజకవర్గంలో ఎన్నికల్లో 75.40 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారుల అంచనా. ఈ సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు కొన్ని ప్రాంతాలలో ఇరుకుమార్గాలను ఏర్పాటు చేయాడం వల్ల ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఇందిరనగర్ కాలనీ, కార్మికనగర్, నాగవరపాడు, తదితర ప్రాంతాలలో రాత్రి 7గంటలు అయిన కొన్ని బూతుల వద్ద ప్రజలు బారులు తీరి ఉన్నారు. అయితే ఎన్నికలు రాత్రి ఎంత సమయం అయిన ఓట్లు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చి ఓటర్లుకు స్లిప్‌లు అందజేశారు

పెడనలో..

విశాలాంధ్ర-పెడన: చెదురు, ముదురు సంఘటనలు, కవ్వింపు చర్యలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా సంపూర్ణంగా జరిగింది. ఓటర్లు తెల్లవారుజామునండి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఉన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు నిదానం అవ్వటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి ఎండ తీవ్రతకు తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. పోలింగ్ సమయం ముగిసే సరికి శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారి తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సమయం ముగియగానే గేట్లు తాళాలు వేసిన తర్వాత పోలింగ్ కేంద్రాల లోపల ఓటర్లు క్యూలైన్లో బారులు తీరి ఉన్నారు. ఈవీఎంలు మొరాయించటం, నిదానంగా ఉండటం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని వాపోయారు. ఎన్నికల అధికారులు మౌలిక వసతులు కల్పించడంలో కూడా పూర్తిగా విఫలమయ్యారని, వృద్ధులకు వీల్ చైర్లు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంతమంది యువకులు ప్లాస్టిక్ కుర్చీలలో వృద్ధులను పోలింగ్ కేంద్రాల వద్దకు మోసుకుంటూ వెళ్లి ఓటు వేయించిన సంఘటనలు పట్టణంలో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) టిడిపి జనసేన బిజెపి కూటమిల అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్ కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు పద్మజాకుమారి వేణుగోపాలరావు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుయక్కల. శ్యామలయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ వి. అప్పారావు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారికా రాము పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఓటేసిన జంగాల, ముప్పాళ్ల

గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దంపతులు

విశాలాంధ్ర-గుంటూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దంపతులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు ఎల్‌బీ నగర్ ఉన్నత ప్రాథమిక పాఠశా లలో జంగాల ఓటు వేయగా, లాడ్జిసెంటర్ సమీపంలోని ఎల్‌ఈఎం స్కూల్‌లో ముప్పాళ్ల దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్... పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రజలకు తాగు నీరు, టెంట్, వైద్య సదుపాయాలు కల్పిం చాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. నగరంలోని వివిధ బూత్‌లను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. పార్ల మెంట్ పరిధిలోని మంగళగిరి తదితర అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను సందర్శించారు.

చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర-చిలకలూరిపేట : చెదురుమదురు సంఘటనల మినహా మొత్తం మీద చిలకలూరి పేటలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ఈవీఎంలు మెరాయించటంతో కొన్ని చోట్ల ఆలశ్యంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద క్యూ కట్టారు. ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పట్టణంలో దుకాణాలు మూతపడటంతో కర్ఫ్యూ వాతావరణం కనిపిం చింది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రానికి ఊపందు కుంది. పట్టణంలో పలుచోట్ల ఈవీఎంలు మోరాయించాయి. 165, 166, 180, 181 పోలింగ్ బూతులు ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం గాక ఓటర్లు బారులుతీరారు. సాయంత్రం సమయానికి పట్టణంలో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో ఈవీఎంలు పనిచేయలేదు. కొంత సమయం అనంతరం వీటిని తిరిగి పునరుద్దరించారు. ఉదయం 8 గంటల వరకు కేవలం 10 శాతమే నమోదైన పోలింగ్ సాయంత్రం 5 గంటల సమయానికి 71.87కు చేరుకోవడం విశేషం.

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలంలోని యాభైతోమ్మిది పోలింగ్ బూత్‌లలో ప్రశాంతంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని సహాయ రిటర్నింగ్ అధికారి కె.వి.వి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం మందకోడిగా మోదలైన పోలింగ్ 11గంటలకు 12 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం నుండి పోలింగ్ వేగం పుంజుకుంది. సాయంత్రం ఆరు గంటలకు 85 శాతం అయ్యిందని కొన్ని చోట్ల సమయం అయిపోవడంతో వరుస క్రమంలో ఉండటంతో సిబ్బంది చీటిలు పంపిణీ చేశారు. పోలింగ్ సుదూర ప్రాంతాల నుండి ఓటర్లు పాల్గొనంటం విశేషం. కపిళేశ్వరపురానికి చెందిన ఎన్నారైలు తాతినేని రమేష్, కొల్లిపర యుగంధర్ ఓట్లు వేయుటకు అమెరికా నుంచి వచ్చామని రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించే నాయకులను ఎన్నుకోవాలని, యువత పలు రంగాల్లో ఉద్యోగాలు సాధించాలని అన్నారు. పోలింగ్‌కు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. మొబైల్ వాహనంలో తిరుగుతూ జనాలు గుమికూడకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా బందోబస్తు నిర్వహించారు.

విశాలాంధ్ర-గన్నవరం: నియోజకవర్గంలో ఒకటి రెండు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 78 శాతం ఓటింగ్ నమోదైంది. గన్నవరం పట్టణంలో వైసిపి అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సతీమణి ఓటు వేశారు. కాంగ్రెసు పార్టీ ఎంపీ అభ్యర్థి

గొల్లు కృష్ణ పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. తెల్లప్రోలులో వైసీపీ, టీడీపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసుకున్నారు. ముస్తాబద్‌లో ఇరువర్గాలు గొడవకు దిగగా పోలీసులు రావటంతో సద్దుమణిగింది

మంగళగిరిలో ఓటేసిన ప్రముఖులు

విశాలాంధ్ర-మంగళగిరి : నగరంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీ 197వ పోలింగ్ బూత్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఓటు వేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురు గుడు లావణ్య, వైసీపీ ఎమ్మెల్సీ మురు గుడు హనుమంతరావులు సీకే జూని యర్ కాలేజీలో తమ ఓటును వినియోగించు కున్నారు. వైసీపీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షులు సజ్జల భార్గవ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి కాజా గ్రామంలోని 133వ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన జంగాల

విశాలాంధ్ర-మంగళగిరి : ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ సోమవారం మంగళగిరి పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో గల పోలింగ్ కేంద్రాన్ని, ఆత్మకూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో పోలింగ్ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్లకు మంచినీరు, మెడిసిన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య, జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, కాబోతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర-తాడికొండ :చెదురుమొదురు ఘటనలు మినహా సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వేసవికాలం కావడంతో తెల్లవారుజాము నుంచి ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం మందకోడిగా సాగిన పోలింగ్ మూడు గంటల నుంచి పోలింగ్ సరళి పెరిగింది. మండలంలో 70 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నారైలు, ఇతర రాష్ట్రాలలో ఉన్న ఓటర్లు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిడుముక్కల గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య జరిగిన వివాదంలో మాజీ సర్పంచ్ బండ్ల శివయ్య తలకు స్వల్ప గాయమైంది. లచ్చన్న గుడిపూడిలో ఇరు వర్గాలు పోలింగ్ కేంద్రం వద్ద వాగ్వాదానికి దిగటంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. రావెల, లాం గ్రామాలలో స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఎలాంటి కేసులు నమోదు కాలేదు. పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన మహిళా ఓటర్



విశాలాంధ్ర-తాడికొండ : అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోతతో ఓ మహిళ ఓటరు పోలింగ్ కేంద్రం వద్ద పడి పోయింది. నియోజక వర్గ కేంద్రమైన తాడికొండకు చెందిన బండ్ల మూడి అనంతలక్ష్మి ఓటు వేసేం దుకు సోమవారం జయ భారత కాలనీలోని 57వ బూత్‌కు వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. క్యూ ఎక్కువగా ఉండటంతో ఓటు వేసేందుకు వచ్చిన అనంతలక్ష్మి పడిపో యింది. స్పందించిన ఏఎన్ఎం హేమలత, ఆశ వర్కర్ చలివేంద్రం హైమావతి, అనంతలక్ష్మికి వైద్య సహాయంతో పాటు గ్లూకోజ్ నీరు అందించి బీపీ చెక్ చేశారు. కొద్ది విరామం అనంతరం ఆమె తమ ఓటు హక్కును వినియోగించుకొని ఇంటికి వెళ్లారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన కేశినేని చిన్ని

విశాలాంధ్ర-నందిగామ: మండలంలోని జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో ఎన్డీఏ కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో మాజీ ఎంపీపీ మన్నే కళావతి, సర్పంచ్ లగడపాటి పుష్ప రేణి తమ ఓటు హక్కు వినియోగించుకున్న వారిని కేశినేని శివనాథ్ పలకరించారు.

భావి తరాలకోసం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళా నాయకులు సుఖాసి సరిత ఆధ్వర్యంలో భావితరాల కోసం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు విజయం సాధించాలని కోరుతూ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు రాష్ట్ర అభివృద్ధికై ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఎంపీగా కేశినేని చిన్ని, ఎంఎల్ఏగా వైఎస్ సత్యనారాయణ చౌదరి విజయం సాధించాలని కోరుతూ కనకదుర్గమ్మ ఆలయ మార్గంలో 101 కొబ్బరికాయలు కొట్టి, ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని పేర్కొన్నారు. తీవ్ర ఎండని సైతం లెక్కచేయకుండా ఓటుకై కదంతొక్కిన మహిళామణులకు అభినందనలు తెలిపారు. తెలుగు మహిళా నాయకులు షేక్ నసీమా, లంకా బుజ్జి, షకీలా వరలక్ష్మి, అపర్ణ, పార్వతి, మరియమ్మ, మల్లీ తదితరులున్నారు.

బూత్‌ల పరిశీలన

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని జుజ్జూరు కేంద్రంలో 152,153,154 బూత్‌లను నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం ఎన్నికల సాధారణ పరిశీలకులు నరేంద్ర సింగ్ బాలి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, ఎన్నికల సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించారని, మీడియా సహకారం బాగుందని ఆయన అన్నారు.

సామాన్యుడిలా న్యాయమూర్తి

విశాలాంధ్ర-వీరులపాడు: మండల పరిధిలోని ఒక న్యాయమూర్తి తన స్వగ్రామమైన జుజ్జూరు గ్రామంలో ఓటు వేయటానికి ఒక సామాన్యుడిలా క్యూ లైన్‌లో రెండు గంటలు నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ అందరితో సమానంగా క్యూ లైన్‌లో వెళ్లటం గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసారు. ఎంత ఎదిగినా మూలాలు మరవలేదని పలువురు కొనియాడారు.

భవానీపురం సీఐపై వేటు

విజయవాడ -విశాలాంధ్ర (క్రైమ్): విజయవాడ భవానీపురం సీఐ కృష్ణ పై వేటు పడింది. అవినీతి ఆరోపణలు, రాజకీయ నేతలతో సంబంధాల కారణంగా, ఇటీవల భారీగా పట్టుబడిన ఎన్నికల నగదు వివిధ ఆరోపణలపై సీపీ రామకృష్ణ దర్యాప్తు చేయించి వీఆర్‌కు పంపారు. కాగా కొత్త సీఐగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు ఎస్ఈబిలో విధులు నిర్వహించారు. ఎన్నికల బదిలీల్లో విజయవాడలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. సీపీ రామకృష్ణ ఉత్తర్వుల మేరకు ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.

స్వల్ప ఉద్రిక్తతల నడుమ పోలింగ్

విశాలాంధ్ర-గురజాల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన గురజాల మండలంలో సోమవారం పలు చోట్ల స్వల్ప ఉద్రిక్తత వాతావరణంలో పోలింగ్ ముగిసింది. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య చెలరేగిన ఘర్షణలు పలు గ్రామాల్లో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసాయి. ఒకరిపై ఒకరు మాటలతో కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా చేశారు. మండలంలోని జంగమహేశ్వరపురం, మాడుగుల, పులిపాడు, దైద, తెలుకుట్ల, చర్లగుడిపాడు గ్రామాల్లో ఇరుపార్టీల నాయకుల మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. తెల్లవారు జామున 6 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మండల వ్యాప్తంగా ఎక్కడా కూడా చెదురుముదురు సంఘటనలు తప్ప అల్లర్లకు తావులేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్షతగాత్రులను పరామర్శించిన బ్రహ్మారెడ్డి:

మాచర్ల నియోజకవర్గం రెంట చింతల మండలం రెంటాల గ్రామంలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడి గురజాల ప్రభుత్వాసు పత్రి లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరామర్శించారు. రాక్షస పాలన నుంచి త్వరలోనే విముక్తి పొందబోతున్నామని, దాడిలో గాయాలపాలైన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రశాంతంగా ఉండే గ్రామంలో వైసీపీ నేతలు అల్లర్లకు పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు.

జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్

- అక్కడక్కడ రాజకీయ వర్గాల మధ్య వాగ్వాదం
- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- రాత్రి 9 గంటల వరకు కొనసాగిన పోలింగ్

విశాలాంధ్ర-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల్లో సందర్భంగా కొత్తగా ఏర్పాటైన ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఉదయం ఆరు గంటలకే ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఎండలు, విధులు, ఇతర పనుల కారణంగా పోలింగ్ ప్రారంభం అయ్యే సమయానికే ఓటర్లు చేరుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎన్నికల అధికారులు పకడ్బందిగా ఏర్పాటు చేశారు. మంచినీరు, టెంట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సహాయసిబ్బంది ఓటర్లకు ఎలాంటి సందేహం వచ్చినా నివృత్తి చేశారు. పోలింగ్ సజావుగా సాగేలా సిబ్బంది వ్యవహరించారు.

ఉదయం 8 గంటల సమయానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసేకునే క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు వారిని అక్కడ నుంచి దూరంగా పంపించేశారు. వాతావరణం చల్లగా ఉండటంమో ఎన్నికల సిబ్బంది కంగారుపడి సరిగా ఆపరేట్ చేయకపోవటం వల్లో పోలింగ్ ప్రారంభంలో కొన్ని చోట్ల ఈవీఎంకు మోరాయించాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టైలర్‌పేట ఆర్‌సీఎం పాఠశాలలో గంటపాటు ఈవీఎంలు పని చేయలేదు. ఏమి జరిగిందని ఓటర్లు పోలింగ్ సిబ్బందిని అడిగేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు పోలింగ్ గంట ఆలస్యంగా ప్రారంభమైనందున పోలింగ్ సమయాన్ని పెంచాలని కోరారు.

జిల్లాలో ఏ.కొండూరులో కృష్ణారావు పాలెం ఎంపీపీ స్కూల్‌లో లంబాడీ మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గొల్లపూడిలోని డీఆర్‌డీఏ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మహిళలు చంటి పిల్లలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం రైల్వే ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రంలో వీవీఐపీలు ఓటు వేశారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పి.ప్రశాంతి దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గం మొగల్రాజపురం వద్ద బీఎస్‌ఆర్‌కే పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గతం కంటే తగ్గిన పోలింగ్ శాతం..

పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో జిల్లా వ్యాప్తంగా 8.95శాతం పోలింగ్ నమోదు అయింది. మధ్యాహ్నం ఒంటి గంటకు 39.69 శాతంగా ఉంది. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయం 6 గంటలకు 73.39 శాతం పోలింగ్ నమోదు అయింది. పోలింగ్ సమయం ప్రకారం చూసుకుంటే గతంలో కంఏట పోలింగ్ శాతం తగ్గింది. 2014లో 77.28 శాతం, 2019లో సార్వత్రిక ఎన్నికల్లో అదే సమయానికి 78.94 శాతం పోలింగ్ నమోదు అయింది. గత ఎన్నికలతో పోల్చితే తగ్గింది.

అయితే సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కేంద్రంలోని క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. రాత్రి 8 గంటల వరకు కొన్ని కేంద్రాల్లో పోలింగ్ కొనసాగుతూనే ఉంది.

రణరంగాన్ని తలపించేలా రాజకీయ దాడులు

విశాలాంధ్ర-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా సోమవారం సాయంత్రం రాజకీయపార్టీల నాయకుల మధ్య జరిగిన దాడులు రణరంగాన్ని తలించింది.

మైలవరం మండలం గణపవరం గ్రామం పోలింగ్ కేంద్రం వద్ద ఉధృత వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావుపై టీడీపీ నాయకుడు శ్యామ్ శ్యామ్ కుర్చీతో దాడి చేయటంతో వెంకటేశ్వరరావు తలకు తీవ్ర గాయాలైయ్యాయి. పోలీసులు రంగ ప్రవేశంతో ఘర్షణ సద్దుమణిగింది.

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానిపురం 36వ బూత్ చైతన్య కాలేజీలో మాజీ కార్పొరేటర్ ఏదుపాటి రామయ్య సోదరుడి కుమారుడు ఓటు వేయడానికి వెళితే వైసీపీ కార్పొరేటర్ చైతన్య రెడ్డి భర్త ప్రసాద్ రెడ్డి పోలింగ్ బూత్‌లోకి దౌర్జన్యంగా వెళ్లి పోలీసుల సమక్షంలో ఆ వ్యక్తిని చితకొట్టాడు. దీంతో టీడీపీ శ్రేణులు భవానిపురం పోలీస్ స్టేషన్ కి చేరుకొని ధర్నా దిగారు. జగ్గయ్యపేటలో వైసీపీ కౌన్సిలర్ భర్త తన్నీరు నాగేంద్రం వృద్ధురాల్ని పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లి ఓటు వేయించినందుకు టీడీపీ కార్యకర్తలు అతనిపై దాడి చేశారు. దీనిపై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో రాయల్ హెూటల్ నందు వైసీపీకి మద్దతుగా ఐప్యాక్ టీం 15 ల్యాప్‌టాప్‌లతో, 30 మంది గ్రూప్ సభ్యులు స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీ, 54వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ పర్యవేక్షణలో హల్‌చల్ చేశారు. వీరిపై బీజేపీ పోతిన అచ్యుతరావు, పోతిన అవినాష్, వారి అనుచరులతో అడ్డుకోగా ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకుని ఎలక్షన్ అధికారులు పోలీసులకు పిర్యాదు చెయ్యగా వారు వచ్చి అక్కడ నుంచి ఐప్యాక్ టీం వారిని అక్కడ నుంచి పంపించేశారు. దానిపై సమగ్ర విచారణ ఎలక్షన్ అధికారులు ఆదేశించారు. ఏ .కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. వత్సవాయి మండలంలో ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి కేశనేని శివనాథ్(చిన్ని) పోలింగ్ బూత్‌ను సందర్శించేందుకు వెళ్లగా స్థానిక వైసీపీ నాయకులు చిన్నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిగా టీడీపీ నాయకులు వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేయటంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

సెంట్రల్‌లో 68.15 శాతం పోలింగ్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సెంట్రల్ నియోజకవర్గంలో ఎన్నికలు చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రశాంతగా ముగిసాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసిన సమయానికి 68.15 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. ఇంకా మరికొన్ని బూత్‌లో ఓటర్లు ఉండటంతో పోలింగ్ కొనసాగుతుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఈవీఎంలు కొన్నిచోట్ల మొరాయించడం వల్ల పలు బూత్‌లలో మంద కొడిగా కొనసాగుతోంది. అనేక చోట్ల ఓటర్లు పోలింగ్ లైన్‌లలో ఉదయం నుంచే మహిళలు, వృద్ధులు బారులు తీశారు. ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. ఎలక్షన్ కమిషన్ చెప్పినదానికి, చేసే దానికి సంబంధం లేదంటూ ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. బూత్‌లకి ఓటర్ స్లిప్పులను ఇవ్వడానికి కూడా అధికారులు రాలేదు. అనేక చోట్ల సమాచార కేంద్రాలు ఉన్నా ఓటర్లుకు ఎటువంటి ప్రయోజనం కలగకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అఖరుకు ఏ బూత్‌లో ఓటు వేయాలో చెప్పడానికి సైతం సిబ్బంది నుంచి సరియైన సమాచారం లభించడంలేదన్నారు. ముఖ్యంగా సత్యనారాయణపురంలోని ఎకెటిపిఎమ్ స్కూల్‌లో 6 బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి అదే ముఖ్యమైన కూడలి కావడంతో అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తారని భావించారు. అయితే కనీసం ఒకటి మాత్రమే వీల్ చైర్ ఏర్పాటు చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు అనేక అగసాట్లకు గురయ్యారు. వారితోటి వచ్చిన వారు చేతుల మీదుగా మోసుకుని తీసుకువెళ్ళ వలసి వచ్చింది. అలాగే క్యూలైన్‌లు కుడా సక్రమంగా నియమించకపోవడం వలన రెండు క్యూలైన్‌లు ఒకచోట కలవడంతో బూత్‌లోకి వెళ్ళేవారు కన్‌ఫ్యూజ్ అయ్యారు. కనీసం సమాచారం ఇచ్చేవారు కూడా లేకపోవడంపై వారు అగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండలో నిలబడి క్యూలైన్‌లో ఉంటే ఈ రూమ్‌కాదు పక్కదానిలో అని చెప్పడంతో మరలా చివరి నుండి రావలసివస్తుందన్నారు. వృద్ధులు, గర్భిణిలు, దివ్యాంగులు, అనారోగ్యంకు గురైన వారికి లైన్‌లో నిలబడి కూడా ఓటువేసే సౌకర్యం కల్పించాలని కోరినా బూత్ సిబ్బంది కుదరదు అని చెప్పడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. వాంబే కాలనీలో ఎమ్‌కె.బేగ్ స్కూల్ ,జంధ్యాల దక్షిణామూర్తి స్కూల్ ,సింగ్ నగర్‌లో బివి .సుబ్బారావు స్కూల్,పుచ్చలపల్లి సుందరయ్య స్కూల్,రాజారాజేశ్వరిపేటలో కేర్ అండ్ షేర్ స్కూల్, దుర్గాపురంలో ఎస్‌కెటివిఆర్ స్కూల్,జాక్ అండ్ జిల్, బిఎస్ రాజు,వివేకనంద, చైతన్య, గాంధీనగర్‌లోని హిందు స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, యువత తమ ఓటును వినియోగించుకున్నారు. కొనిచోట్ల టిడిపి ,వైసిపి నాయకులు మధ్య చిన్నచిన్న గొడవలు జరగటంతో పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలను పంపివేశారు. ఎన్నికలు ప్రశాంతగా జరగడానికి సెంట్రల్ ఎన్నికల పరిశీలకులు అధ్వర్యంలో పోలీసులు పటిష్ఠమైన భద్రత చర్యలు చేపట్టారు.

అట్టుడికిన మాచర్ల...

విశాలాంధ్ర-మాచర్ల : నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు విధ్వంసాలకు పాల్పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఎమ్మెల్యేగా నాలుగుసార్లు విజయం సాధించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియోజక వర్గంలో తన పట్టునుకోల్పోకుండా 5వ సారి వైసీపీ జెండాను ఎగర వేసేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు. అదే స్థాయిలో ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా నియోజకవర్గంలో ఇన్ చార్జ్‌గా అడుగుపెట్టిన నాటి నుంచి రోజురోజుకు తన ఉనికిని చాటు కుంటూ కార్యకర్తలకు అండగా నిలబడి పార్టీని బలోపేతం చేసు కుంటూ వస్తున్నారు. ఈ తరుణంలో ఇప్పటిదాకా మాకు ఎదురులేదను కుంటున్న ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులకు కంటిమీద కునుకు లేకుండా చేసుకుంటూ వచ్చారు. చివరకు సోమవారం జరిగిన ఎన్నికలలో టీడీపీ ఏజెంట్లను బూత్‌లలో కూర్చొనివ్వకుండా చేసే ప్రయత్నంలో భాగంగా రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామంలో ఇద్దరు టీడీపీ ఏజెంట్ల కుటుంబాలపై వైసీపీ కార్యకర్తలు సోమవారం ఉదయం దాడిచేశారు. దానికంటే ముందు ఆదివారం రాత్రి కూడా టీడీపీ ఏజెంట్లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ నేపథ్యంలో వైసీపీ, టీడీపీ మధ్య వివాదం మరింత ముదిరింది. ఈ క్రమంలో టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి రెంటాలలో వైసీపీ మూకల చేతిలో గాయపడిన ఏజెంట్లను పరామర్శించేందుకు వెళ్లి అక్కడే పోలింగ్ సరళిని పరిశీలించేందుకు బూత్‌లోకి వెళ్ళగా అదే సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు బ్రహ్మారెడ్డిని తలుపులు వేసి నిర్బంధించారు. ఈ దాడులలో ఒప్పిచర్ల, తుమ్మకోట, పాల్వాయి గేటు, జెట్టిపాలెం గ్రామాలలో ఈవీఎంలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎన్నికల అధికారి శ్యాం ప్రసాద్ మరల ఈవీఎంలను తెప్పించి పోలింగ్‌ను పునరుద్ధరించారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఘర్షణలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ఓ సందర్భంలో ప్రజలు ఓటు వేసేందుకు కూడా బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. రెండు ప్రధాన పార్టీల ఆధిపత్య పోరులో ఒకరిపై ఒకరు చేసుకున్న దాడులను సోషల్ మీడియాలో చూసి ప్రజలు బీతావహులవుతున్నారు.

సోమవారం మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ఘర్షణలకు పూర్తిగా పోలీసుల వైఫల్యమే కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వినుకొండలో పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర- వినుకొండ : పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అయితే ఉదయం ఏడు గంటలకే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా బూతులు వద్ద క్యూలో బారులు తీరారు. పట్టణంలో మొత్తం 45 పోలింగ్ బూతులు ఏర్పాటు చేయగా కొన్ని బూతుల్లో ఈవీఎంలు మొరాయించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. అయితే ఎండ తక్కువగా ఉన్న కారణంగా ఓటర్లు ఎటువంటి అసహనానికి లోను కాకుండా ఓటు హక్కును విని యోగించుకున్నారు. కాగా 217 బూతులో ఈవీఎం గంటపాటు మొరాయించింది. అలాగే 180 నెంబరు, 204, 181, 184, 187, 214, 215, 210, 211 బూతుల్లో గంటకు పైగా ఈవీ ఎంలు పనిచేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. తమ ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక వినుకొండ పట్టణంలో కూటమి టీడీపీ అభ్యర్థి జీవి, సతీమణి లీలావతి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే స్వగ్రామమైన వేల్పూరులో వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే వినుకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లి కార్జునరావు మరో మాజీ ఎమ్మెల్యే వీరపనేని ఎలమందరావు ఓటు వేశారు. అన్ని బూతుల్లో ఎక్కడికక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. అలాగే హైదరాబాద్ నుండి పెద్ద ఎత్తున ప్రజలు యువతీ, యువకులు బస్సుల్లో వినుకొండ చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొందరు యువతులు తమ తొలి ఓటు హక్కును వినుకొండలో వినియోగించుకున్నారు.కాగా సాయంత్రం 5 గంటల వరకు 72.58% ఓటింగ్ నమోదైనట్లు పోలింగ్ అధికారి తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

పోటెత్తిన ఓటరు...

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కును వినియోగించుకునేందుకు విస్సన్నపేట మండలంలో పెద్దసంఖ్యలో ఓటర్లు తరలివచ్చారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ఆరంభం కావలసి ఉండగా, సుమారు గంట ముందుగానే పలు కేంద్రాల వద్దకు పెద్దసంఖ్యలో ఓటర్లు చేరుకుని, వేచి చూడటం విశేషం. అక్కడక్కడా కొద్దిసేపు పోలింగ్ యంత్రాలు మొరాయించటం, పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగటంతో ఓటింగ్‌లో జాప్యం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు క్యూలైన్లలో వేచి ఉండి, వివిధ గ్రామాల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తిరువూరు నియోజకవర్గ స్థాయిలో సాయంత్రం 5గంటల సమయానికి పోలింగ్‌శాతం 74.03శాతంగా అధికారులు ప్రకటించగా, ముగిసే సమయానికి సుమారు 80శాతానికి చేరుకుంది. విస్సన్నపేట ఎంపీయూపీ పాఠశాల, సెయింట్‌థెరిస్సా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాల వద్ద కూటమి, వైసీపీ కార్యకర్తలు ఒకరికొకరు కవ్వింపు చర్యలకు దిగి, కొంత ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ, పోలీసుశాఖ ముందుజాగ్రత్తలు తీసుకుని వారిని నిలువరించారు. కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు మండలంలోని పలు పోలింగ్‌కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.

బారులు తీరిన ఓటర్లు

విశాలాంధ్ర- నందిగామ: గతానికి భిన్నంగా మండుటలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు, ముఖ్యంగా యువత మహిళలు తెల్లవారుజాము 5 గంటల నుండి పోలింగ్ కేంద్రాల వద్ద పోటెత్తారు, ఎన్టీఆర్ జిల్లా నందిగామ 83 ఎస్సీ నియోజకవర్గంలోని నందిగామ కంచికచర్ల వీరులపాడు చందర్లపాడు మండలాల్లో సాయంత్రం ఐదు గంటలకే 72శాతం పైగా పోలింగ్ అయిందని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. ఇంకా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. మొత్తంగా 80 నుండి 90% వరకు పోలింగ్ జరిగే పరిస్థితులు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. కాగా పని కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకోడిగా సాగింది. పలుచోట్ల పోలింగ్ కేంద్రాలను వసతులు లేని ఇరుకు గదులు వెలుతురు లేని గదుల్లో నిర్వహించడం వల్ల ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు, కాగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పలుచోట్ల అధికార ప్రతిపక్ష పార్టీల నడుమ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంబంధిత అధికారుల జోక్యంతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగింది,

కన్నా పై దాడి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో ముప్పాళ్ళ మండలం చాగంటి వారి పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ లోని పోలింగ్ కేంద్రంలో దగ్గరుండి రిగ్గింగ్ చేయిం చిన అంబటి రాంబాబు అనుచరులను అడ్డుకోబోయిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పై రాళ్ల వర్షం కురిపించారనీ, తెలుగుదేశం నాయకులు విమర్శించారు. ముప్పాళ్ళ మండల ంలోని చాగంటి వారి పాలెం గ్రామానికి చెందిన వైకాపా అల్లరి మూకల్ని అడ్డుపెట్టుకుని, అంబటి రాంబాబు రిగ్గింగ్ చేయించార న్నారు. పోలింగ్ కేంద్రాలను చూడనివ్వ కుండా పాఠశాలలో తన అల్లరి మూకల్ని ఉంచి రిగ్గింగ్ చేయిస్తూ. అడ్డుకోబోయిన కన్నా లక్ష్మీనారాయణపై తెలుగుదేశం పార్టీ శ్రేణులపై రాళ్లతో కర్రలతో దాడి చేయించారు.ఈ దాడి పై కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.

మండలంలో ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. మండలంలో అన్నవరం గ్రామంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ జరుగుతున్నప్పుడు టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వివాదం జరగటంతో పోలీసులు వెంటనే స్పందించి వారిని చెదరగొట్టటంతో వివాదం సద్దుమణిగింది. మండలంలో అన్ని గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను ఐజి త్రిపాఠి పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులు, అధికసంఖ్యలో మహిళలు, నూతనంగా ఓటర్లు నమోదైన యువకులు ఓటు హక్కును వినియోగించుకొన్నారు. మండలంలో అన్నవరం గ్రామంలో 105 సంవత్సర ములు వయస్సు కలిగిన కాకుమాను మహాలక్ష్మమ్మ అనే శతాధిక వృద్ధురాలు 17వ సారి ఓటు హక్కును వినియోగించుకొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు తమ కుటుంబ సభ్యులు సహకారంతో పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళి ఓటు హక్కును వినియోగించు కొన్నారు. వర్షము కురిసి వాతావరణం చల్లబడటంతో ఓటర్లు ఎండ ప్రభావమునకు గురికాలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది ఓటర్లకు మంచినీటి సౌకర్యం కల్పించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలలో పోలింగ్ ప్రశాంతంగా జరగటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144వ సెక్షన్ అమలు చేయడం జరిగింది. మండలంలో మధ్యాహ్నాము వరకు 30 శాతం పోలింగ్ జరిగింది. మండలంలో సాయంత్రం ఐదు గంటల వరకు 76.58 శాతం పోలింగ్ జరిగిందని పోలింగ్ అధికారులు తెలిపారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియటంతో పోలీసులు, పోలింగ్ అధికారులు, ఓటర్లు ఊపిరిపీల్చుకున్నారు.